@netifocusnews @focustv
www.netifocusnews.com
http://epaper.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || గురువారం 11, జులై 2024 || పేజీలు: 04

## చిన్నారులు చనిపోతుంటే
# నిర్లక్ష్యమా?

- కుక్కల దాడులపై నిపుణుల కమిటీ వేయండి: హైకోర్టు
- జూబ్లీహిల్స్‌పై కాదు.. మురికి వాడలపై దృష్టిపెట్టాలని వ్యాఖ్య
- వీధి కుక్కల దాడులపై హైకోర్టు తీవ్ర ఆందోళన

➤ వివరాలు 02లో..



## రహదారుల భూ సేకరణలో మానవీయ కోణంతో
# వ్యవహరించండి

### రైతులకు వీలైనంత ఎక్కువ మొత్తం దక్కేలా చూడండి..





- వారితో కలెక్టర్లే మాట్లాడాలి..
- ఆర్‌ఆర్‌ఆర్ మొత్తానికీ ఒకే నంబరు
- కేంద్రం, ఎన్‌హెచ్‌ఏఐతో ఒప్పందం చేసుకోండి
- ప్రత్యామ్నాయం చూపి అటవీ భూములు తీసుకోండి
- జాతీయ రహదారులపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- నాగ్‌పూర్-విజయవాడ కారిడార్‌లో సర్వీస్ రోడ్లు, అండర్‌పాసలు నిర్మించాలి: డిప్యూటీ సీఎం భట్టి
- రెండు నెలల్లో 'హైదరాబాద్-విజయవాడ' జాతీయ రహదారి విస్తరణ: ఎన్‌హెచ్‌ఏఐ
- పద్మశ్రీ గ్రహీతలకు సీఎం సన్మానం
- ఒక్కొక్కరికి రూ.25లక్షల చెక్కు అందజేత

హైదరాబాద్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 10:

జాతీయ రహదారులకు భూమి సేకరించే విషయంలో మానవీయ కోణంతో వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. తరతరాలుగా భూమినే నమ్ముకొని బతుకుతున్న రైతులకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. పరిహారం విషయంలో రాజీ పడొద్దని సూచించారు. భూ సేకరణలో నిబంధనల ప్రకారం పరిహారం ఎంత ఎక్కువగా వస్తే, అంతమొత్తం రైతులకు దక్కేలా చూడాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు. భూములు కోల్పోయే మిగతా 2లో..

## సెక్షన్ 125 కింద ముస్లిం మహిళలూ భరణానికి అర్హులే

- భరణం.. 'దయ' కాదు.. హక్కు
- సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు

2





## రుణమాఫీపై
# కసరత్తు



### నిధుల సేకరణపై ప్రభుత్వం దృష్టి
### మూడు దశల్లో ఇచ్చేలా ప్రణాళికలు..

- గతంలో తప్పులు పునరావృతం కాకుండా ఏర్పాట్లు
- ఇప్పటికే బ్యాంకులతో చర్చించిన సీఎం..

హైదరాబాద్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 10:

రైతు రుణమాఫీపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2లక్షల వరకు పంట రుణాల మాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇదే విషయమై ఇటీవల బ్యాంకర్లతో భేటీ అయ్యారు. మరోవైపు నిధుల సమీకరణ కోసం ఢిల్లీ స్థాయిలో ప్రధాని మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులను సైతం కలిసి విన్నవించినట్టు తెలుస్తోంది. మిగతా 2లో..



## తెలంగాణ డీజీపీగా
# జితేందర్

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- నిర్మల్ ఏఎస్పీ నుంచి డీజీపీ దాకా..
- సీఎం రేవంత్‌తో మర్యాదపూర్వక భేటీ

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 10:

తెలంగాణ డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి జితేందర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు డీజీపీగా ఉన్న రవి గుప్తాను హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నూతన డీజీపీగా నియమితులైన జితేందర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మిగతా 2లో..



# వ్యవసాయ రంగాన్ని కాపాడుదాం..

### 'రైతుభరోసా' ఇచ్చేందుకు దృఢసంకల్పంతో ఉన్నాం

- అర్హులకే రైతుభరోసా పెట్టుబడి
- సన్న, చిన్నకారు రైతులకే చేయూత
- హామీల అమలుకే ప్రజాభిప్రాయ సేకరణ
- వెల్లడించిన మంత్రులు భట్టి, పొంగులేటి, తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 10:

వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా అందజేస్తామని గత ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. హామీని అమలు చేయడం కోసం ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందన్నారు. ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించిన రైతు భరోసా పథకం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో మాట్లాడారు. మిగతా 2లో..




## తెలంగాణలో 15మంది
# ఐపీఎస్‌ల బదిలీలు

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 10:

తెలంగాణలో 15 ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. శాంతి భద్రతల అదనపు డీజీపీగా మహేశ్ భగవత్ హోంగార్డుల, ఆర్గనైజేషన్ అదనపు మిగతా 2లో..

నేటి ఫోకస్ న్యూస్

గురువారం 11, జులై 2024

# డీజీపీగా జితేందర్

(మొదటి పేజీ తరువాయి..)

**నిర్మల్ ఏఎస్పీ నుంచి డీజీపీ దాకా..**

పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో రైతు కుటుంబంలో జన్మించిన జితేందర్ 1992 ఐపీఎస్ బ్యాచ్ అధికారి. ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు ఎంపికయ్యారు. తొలుత నిర్మల్ ఏఎస్పీగా పనిచేసిన అనంతరం బెల్లంపల్లి అదనపు ఎస్పీగా విధులు నిర్వర్తించారు. అప్పట్లో నక్సల్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న మహబూబ్‌నగర్, గుంటూరు జిల్లాల ఎస్పీగా ఉన్నారు. తర్వాత ఢిల్లీ సీబీఐలో.., 2004-06 వరకు గ్రేహౌండ్స్‌లో పనిచేశారు. అనంతరం డీఐజీగా పదోన్నతి పొంది విశాఖపట్నం రేంజ్‌లో బాధ్యతలు నిర్వర్తించారు. అప్పాలో కొంతకాలం పనిచేసి తెలంగాణ ఉద్యమం సమయంలో వరంగల్ రేంజ్ డీఐజీగా కొనసాగారు. ఆంధ్రప్రదేశ్ సీఐడీ, ఎంక్వయిరీ కమిషన్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెం ట్‌లో బాధ్యతలు నిర్వర్తించిన అనంతరం హైదరాబాద్ కమిషనరేట్‌లో ట్రాఫిక్ అదనపు కమిషనర్‌గా పనిచేశారు. తర్వాత తెలంగాణ శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీగా, జైళ్లశాఖ డీజీగా పనిచేశారు. ప్రస్తుతం హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న ఆయన 2025 సెప్టెంబరులో పదవీ విరమణ చేయనున్నారు. దీంతో తెలంగాణ డీజీపీగా 14 నెలలపాటు కొనసాగే అవకాశం ఆయనకు ఉంది. మరోవైపు ప్రస్తుత డీజీపీ రవి గుప్తాను హోంశాఖలో ప్రభుత్వ ప్రత్యేక చీఫ్ సెక్రటరీగా నియమిస్తున్నట్టు ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతం అందిస్తున్న స్కేలు ప్రకారమే ఆయనకు వేతనం అందించనున్నట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది. కాగా తెలంగాణ డీజీపీగా నియమితులైన సందర్భంగా సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని జితేందర్ కలిశారు. మర్యాదపూర్వకంగా కలిసిన డీజీపీకి సీఎం రేవంత్ అభినందనలు తెలిపారు.

# తెలంగాణలో 15మంది ఐపీఎస్‌ల బదిలీలు

(మొదటి పేజీ తరువాయి..)

డీజీగా స్వాతి లక్రా, గ్రేహౌండ్స్ ఏడీజీగా స్టీఫెన్ రవీంద్ర, పోలీస్ పర్సనల్ అదనపు డీజీగా విజయ్ కుమార్ (పోలీసు సంక్షేమం, క్రీడల అదనపు బాధ్యతలు), టీజీఎస్పీ బెటాలియన్ల అదనపు డీజీగా సంజయ్ కుమార్, రాచకొండ పోలీస్ కమిషనర్‌గా సుధీర్ బాబు, ఏసీబీ డైరెక్టర్‌గా తరుణ్ జోషి, మల్టీజోన్-1 ఐజీగా ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, మల్టీజోన్ -2 ఐజీగా వి.సత్యనారాయణ, రైల్వే, రోడ్ సేఫ్టీ ఐజీగా కె.రమేశ్ నాయుడు, మెదక్ ఎస్పీగా ఉదయ్ కుమార్‌రెడ్డి, వనపర్తి ఎస్పీగా ఆర్.గిరిధర్, హైదరాబాద్ తూర్పు మండలం డీసీపీగా జి.బాలస్వామి, హైదరాబాద్ పశ్చిమ మండలం డీసీపీగా జి.చంద్రమోహన్, సీఏఆర్‌హెడ్ క్వాటర్స్ డీసీపీగా రక్షితమూర్తి బదిలీ అయ్యారు.

## సెక్షన్ 125 కింద ముస్లిం మహిళలూ భరణానికి అర్హులే

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 10:

భర్త నుంచి భరణం కోరే హక్కును భార్యకు ఇచ్చే సీఆర్‌పీసీ సెక్షన్ 125 దేశంలోని వివాహితలు అందరికీ మతాతీతంగా వర్తిస్తుందని తేల్చి చెప్పింది. 2019నాటి 'ముస్లిం విమెన్ (ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్ ఆన్ మ్యారేజ్) యాక్ట్‌కు విరుద్ధంగా.. ముమ్మారు తలాఖ్ చెప్పడం ద్వారా భార్యకు విడాకులు ఇస్తే.. భార్య ఆ చట్టంతోపాటు, ఈ సెక్షన్ ద్వారా కూడా భరణం కోరవచ్చని స్పష్టం చేసింది. తెలంగాణకు చెందిన మహ్మద్ అబ్దుల్ సమద్ అనే వ్యక్తి దాఖలు చేసిన అప్పీలుపై విచారణ జరిపి ఈ చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. అబ్దుల్ సమద్ తన భార్యకు 2017లో ముస్లిం పర్సనల్ లా ప్రకారం విడాకులు ఇచ్చారు. దీంతో ఆమె.. సీఆర్‌పీసీ సెక్షన్ 125 కింద భర్తతో తనకు భరణం ఇప్పించాలని కోరుతూ ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ వేశారు. పూర్వాపరాలను పరిశీలించిన ఫ్యామిలీ కోర్టు.. నెలకు రూ.20 వేలు భరణం కింద చెల్లించాలని సమద్‌ను ఆదేశించింది. ఆ తీర్పును సమద్ తెలంగాణ హైకోర్టులో సవాల్ చేశారు. ముస్లిం పర్సనల్ చట్టం ప్రకారం.. తాను భరణం ఇవ్వాల్సిన అవసరం లేదని, ఆ విషయాన్ని ఫ్యామిలీ కోర్టు పట్టించుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఫ్యామిలీ కోర్టు తీర్పును రద్దు చేయటానికి హైకోర్టు నిరాకరించింది. నెలకు చెల్లించాల్సిన భరణాన్ని మాత్రం రూ.10 వేలకు తగ్గించింది. బాధితురాలు పిటిషన్ వేసినప్పటి నుంచి భరణం చెల్లించాలని ఆదేశించింది. దీనిని సమద్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది వసీం ఖాద్రీ వాదనలను వినిపించారు. విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలకు 'ముస్లిం మహిళల విడాకుల హక్కుల పరిరక్షణ చట్టం, 1986' వర్తిస్తుందిగానీ, సీఆర్‌పీసీ సెక్షన్ 125 వర్తించదని.. భరణం చెల్లించాల్సిన అవసరం లేదని వాదించారు. ముస్లిం మహిళలకు సీఆర్‌పీసీ సెక్షన్ 125 కన్నా, 1986 నాటి చట్టమే అధిక ప్రయోజనం కలిగిస్తుందన్నారు. కాగా, ఈ కేసులో గౌరవ్ అగర్వాల్ అనే న్యాయవాదిని అమికస్ క్యూరీ(కోర్టు సహాయకుడిగా)గా న్యాయస్థానం నియమించింది. వాదనలను విన్న సుప్రీం కోర్టు తీర్పును ఈ ఏడాది ఫిబ్రవరి 19వ తేదీన రిజర్వు చేసింది. తాజాగా బుధవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం తీర్పును వెలువరించింది. 'ముస్లిం మహిళల విడాకుల హక్కుల పరిరక్షణ చట్టం, 1986', సీఆర్‌పీసీ 125 సెక్షన్.. ఈ రెండింటిలో 125 సెక్షనే ఈ కేసులో వర్తిస్తుందని ధర్మాసనం తన తీర్పులో స్పష్టం చేసింది. "మతాల సరిహద్దులకు అతీతంగా వివాహిత మహిళలకు ఆర్థిక భద్రత కల్పించే, లింగ సమానత్వాన్ని బలోపేతం చేసే హక్కు భరణం" అని స్పష్టం చేసింది. అయితే.. ముస్లిం మహిళలు భరణం కోసం 1986లో రాజీవ్‌గాంధీ సర్కా రు తెచ్చిన 'ముస్లిం మహిళల విడాకుల హక్కుల పరిరక్షణ చట్టం, 1986' ను, సీఆర్‌పీసీ 125 సెక్షన్‌ను.. రెండింటినీ ఉపయోగించు కోవచ్చని, ఇవి పరస్పర ఆధారితాలేగానీ పోటీ కావని తెలిపింది. ఈ మేరకు హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సమద్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.


## యూపిలో ఘోర రోడ్డు ప్రమాదం

- పాల ట్యాంకర్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు
- ప్రమాదంలో 18మంది దుర్మరణం

లక్నో, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 10:

ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఉన్నావ్ జిల్లాలో బుధవారం తెల్లవారుజామున ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై స్లీపర్ బస్సు, పాల ట్యాంకర్‌ను ఢీకొనడంతో 18 మంది మృతి చెందగా, 19 మందికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఉన్నావ్ జిల్లా బంగార్‌మౌ ప్రాంతంలోని జోజికోట్ గ్రామ సమీపంలోని బెహతా ముజావర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించామని, వారి పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు చెప్పారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లవారుజామున 5.15 గంటలకు బీహార్ నుంచి ఢిల్లీ వెళ్తున్న డబుల్ డెక్కర్ బస్సు పాల ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులందరినీ బయటకు తీసి చికిత్స నిమిత్తం సిహెచ్‌సి బంగార్మావుకు తరలించారు. కాగా, ప్రాథమిక విచారణలో బస్సు అతివేగంగా దూసుకురావడంతో ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించి మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

# రహదారులకు భూసేకరణలో మానవీయ కోణంతో వ్యవహరించండి







(మొదటి పేజీ తరువాయి..)

రైతులతో కలెక్టర్లే నేరుగా మాట్లాడి, వారిని ఒప్పించాలని చెప్పారు. తెలంగాణలో 'జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)' పరిధిలో రహదారుల నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలపై బుధవారం సచివాలయంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రానికి మంజూరైన జాతీయ రహదారులకు భూ సేకరణ ఎందుకు ఆలస్యమవుతోందని సీఎం ప్రశ్నించారు.

ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరలు తక్కువగా ఉండడం, మార్కెట్ ధరలు ఎక్కువగా ఉండడంతో భూములిచ్చేందుకు రైతులు ముందుకు రావడం లేదని కలెక్టర్లు తెలిపారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం, ఉత్తర భాగాలకు ఒకే నంబరు కేటాయించాలని కేంద్ర మంత్రి గడ్కరీని కోరగా, సూత్రప్రాయంగా అంగీకరించారని రేవంత్ చెప్పారు. దానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ విషయంలో తొలుత రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వం, ఎన్‌హెచ్‌ఏఐ మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉంటుందని అధికారులు చెప్పగా.. వెంటనే ఆ పని పూర్తిచేయాలని సీఎం ఆదేశించారు. ఇక ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం భూ సేకరణలో ఉన్న ఆటంకాలపైనా రేవంత్ ఆరా తీశారు. అలైన్‌మెంట్ విషయంలో కొందరు రైతులు హైకోర్టును ఆశ్రయించడంతో స్టే ఇచ్చిందని యాదాద్రి కలెక్టర్ హన్మంత్ తెలపగా.. స్టే తొలగింపునకు వెంటనే కౌంటర్ దాఖలు చేయాలని సీఎం సూచించారు. నాగ్‌పూర్- విజయవాడ కారిడార్‌లో ఖమ్మం జిల్లాలో భూసేకరణ పరిస్థితి ఏ దశలో ఉందని రేవంత్ అధికారులను అడిగారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ అంశంపై మాట్లాడుతూ.. ఖమ్మం సమీపంలోని విలువైన భూముల గుండా రహదారి వెళ్తోందని, పరిహారం విషయంలో రైతులను ఒప్పిస్తున్నామని తెలిపారు. తల్లాడ-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు సాగుతున్నందున, ప్రస్తుతం ఖమ్మం-అశ్వారావుపేట జాతీయ రహదారిని రాష్ట్ర రహదారిగా మార్చుకోవాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సూచిస్తున్నారని.. దానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించవద్దని తుమ్మల చెప్పారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ.. నాగ్‌పూర్-విజయవాడ కారిడార్‌లో భాగంగా నిర్మిస్తున్న రహదారిలో పెద్ద గ్రామాలున్న చోట సర్వీసు రోడ్లు నిర్మించాలని, రైతులు పొలాలకు వెళ్లేందుకు వీలుగా అండర్ పాస్‌లు నిర్మించాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను కోరారు. దీంతోపాటు జాతీయ రహదారుల వెంట వ్యవసాయ వాహనాలు, రైతులు వినియోగించుకునేలా గ్రావెల్ రోడ్లు నిర్మించాలనే ప్రతిపాదనపై చర్చకు రాగా.. ఈ రెండు అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు సభ్యుడు అనిల్ చౌదరి చెప్పారు. గ్రావెల్ రోడ్లు నిర్మించడం వల్ల రైతులకు ఉపయోగపడడంతో పాటు భవిష్యత్తులో రహదారి విస్తరణకు ఇబ్బందులు ఉండవని సీఎం అభిప్రాయపడ్డారు.

**సమన్వయంతో ముందుకు సాగండి..**

ఆర్మూర్- జగిత్యాల- మంచిర్యాల, విజయవాడ-నాగ్‌పూర్ కారిడార్ రహదారులకు సంబంధించి అటవీ శాఖ భూముల బదలాయింపు సమస్యపైనా సమీక్షలో చర్చ జరిగింది. దీనిపై సీఎం రేవంత్ మాట్లాడుతూ.. అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ భూములు కేటాయించాలని కలెక్టర్లకు సూచించారు. ఈ విషయంలో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. రహదారుల నిర్మాణానికి ఉన్న ఆటంకాలను తొలగించాలన్నారు. హైదరాబాద్-మన్నెగూడ రహదారి పనులను త్వరగా ప్రారంభించాలని, విజయవాడ-నాగ్‌పూర్ రహదారి నిర్మాణానికి భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం సూచించారు. హైదరాబాద్-విజయవాడ రహదారి ఆరు వరసల విస్తరణకు భూసేకరణ పూర్తయినందున వెంటనే పనులు చేపట్టాలని మంత్రి కోమటిరెడ్డి కోరగా.. రెండు నెలల్లో ప్రారంభిస్తామని అనిల్ చెప్పారు.

# రుణమాఫీపై సర్కారు కసరత్తు

(మొదటి పేజీ తరువాయి..)

**నిధుల సేకరణపై ప్రభుత్వం దృష్టి..**

ఆగస్టు 15లోగా రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నిధుల సేకరణపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ముఖ్యంగా ప్రతి నెలా తీసుకుంటున్న రుణాలను జాగ్రత్తగా ఖర్చు చేస్తూ, పాత అప్పుల కిస్తీలు కడుతూ ఎంతో కొంత నిధులను ఆదా చేస్తూ వచ్చింది. రాష్ట్ర ఖజానాకు వివిధ మార్గాల ద్వారా వస్తున్న ఆదాయంలోనూ కొంత మిగులుబాటు అయ్యేలా కసరత్తు చేయాల్సిందిగా ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించింది. అదే సమయంలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి ఢిల్లీ స్థాయిలోనూ ప్రయత్నా లు చేస్తున్నారు. మార్కెట్ నుంచి సేకరించే బడ్జెట్ అప్పులను జూలై, ఆగస్టు నెలల్లో ఎక్కువ మొత్తంలో తీసుకునేందుకు అవకాశం కల్పించాలని కేంద్రాన్ని కోరుతూనే.. భూములను హామీగా పెట్టి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి తీసుకోవద్దంటూ విజ్ఞప్తి చేస్తోంది. మరోవైపు నెలవారీగా తీసుకుంటున్న బడ్జెట్ రుణాలను ఖజానాలో జమ చేసి పెడుతోంది. ఇప్పటికే రుణమాఫీ పథకం కోసం రూ.10 వేల కోట్ల వరకు ఖజానాలో నిల్వ చేసినట్లు సమాచారం. వాస్తవానికి రుణమాఫీ కోసం రూ.31 వేల కోట్లు అవసరమవుతాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇది ప్రాథమికంగా అంచనా వేసిన మొత్తం. పథకాన్ని పూర్తిగా అమలు చేసేనాటికి నిధుల మొత్తం తగ్గవచ్చన్న అభిప్రాయాలున్నాయి. ఏదేమైనాఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఏప్రిల్‌లో రూ.4000 కోట్లు, మేలో 4000 కోట్లు, జూన్‌లో 5000 కోట్ల చొప్పున మార్కెట్ రుణాలను సేకరించింది. జూలై, ఆగస్టు నెలల్లో తీసుకునే మార్కెట్ రుణాల్లో కొన్ని నిధులను రుణమాఫీ పథకానికి మళ్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జూలైలో రూ.6, 500 కోట్లు, ఆగస్టులో రూ.5000 కోట్ల మేర రుణం తీసుకోవాలని ముందస్తు ప్రణాళికను నిర్దేశించుకుంది. ఆ 11,500 కోట్లలో ప్రభుత్వ వ్యయాలు, పాత అప్పుల కిస్తీలు పోను ఎంతో కొంత ఆదా చేయనుంది. ఈ రెండు నెలల రుణాల్లో ఇప్పటికే రూ.2000 కోట్లు తీసుకున్నందున మిగతా రూ.9,500 కోట్లలో ఒకేసారి ఎక్కువ మొత్తాన్ని తీసుకోవడానికి అనుమతి ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారు. కేంద్రం అనుమతించి, ఒకేసారి పెద్ద మొత్తంలో రుణం తీసుకుంటే ఎక్కువ భాగాన్ని రుణమాఫీ పథకానికి మళ్లించాలని సర్కారు యోచిస్తోంది.

రుణమాఫీ పథకంతో పాటు ఇతర వ్యయాల కోసం ప్రభుత్వం పలు రకాలుగా నిధుల సేకరణ ప్రయత్నాలు చేస్తోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూములను ప్రైవేటు బ్యాంకుల వద్ద హామీగా పెట్టి రుణాలు తీసుకోవడంపై కసరత్తు చేస్తోంది. కానీ, ఇలాంటి రుణాలపై కొన్ని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రుణాలను కూడా ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోనే లెక్కిస్తామంటూ కేంద్ర ప్రభుత్వం భీష్మిస్తే ఇబ్బంది తప్పదన్న అభిప్రాయాలున్నాయి. ఇలాంటి రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి తీసుకోవద్దంటూ సీఎం, డిప్యూటీ సీఎంలు ప్రధాని, ఆర్థిక మంత్రిని కోరారు. దీనికి కేంద్రం ఆమోదం తెలపాల్సి ఉంది. మరోవైపు పరిశ్రమలకు కేటాయించిన భూములను వాణిజ్య, నివాస అవసరాల కోసం మార్పిడి చేయాలన్న ఆలోచన కూడా ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో చాలా భూములను పారిశ్రామిక యూనిట్లకు కేటాయించారు. కానీ, కొన్నింటిలో ఎలాంటి యూనిట్లు ఏర్పాటు కాలేదని, ఆర్థిక, పారిశ్రామిక ఉత్పత్తి కార్యకలాపాలను ప్రారంభించలేదని ప్రభుత్వం గుర్తించింది. అలాంటి భూములను నివాసయోగ్య స్థలాలుగా మార్చి, విక్రయించే ఆలోచన చేస్తోంది. ఇలా వచ్చే నిధులను రుణమాఫీ పథకానికి మళ్లించడంతో పాటు రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలకు వినియోగించాలన్న ఆలోచనలో ఉంది. అందుకే రుణమాఫీని 3 దశలుగా అమలు చేయాలని యోచిస్తోంది. ముందుగా రూ.లక్ష లోపు రుణాలను, తర్వాత రూ.లక్షన్నర లోపు, అనంతరం రూ.2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేయాలని భావిస్తోంది. ఇదంతా కొన్ని రోజుల తేడాతో సాగే ప్రక్రియ అయినందున.. ఒకేసారి రుణమాఫీ పథకాన్ని వర్తింపజేశామని చెప్పనుంది.

**గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా ఏర్పాట్లు..**

గతంలో లక్ష రూపాయల వరకు పంట రుణాలు మాఫీ చేస్తామని చెప్పి అధికారం చేపట్టిన బీఆర్ఎస్ రుణమాఫీ చేసేందుకు రకరకాల కొర్రీలు పెట్టిందని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పదేపదే ఆరోపణలు గుప్పించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో మొత్తం 40.66 లక్షల మంది రైతులకు రూ. 25,916 కోట్లు మాఫీ చేయాల్సి ఉండగా.. కుటుంబ సభ్యుల్లో ఒకరికి మాత్రమే వర్తిస్తుందని కొర్రీ పెట్టి లబ్ధిదారుల సంఖ్యను కుదించిందని ధ్వజమెత్తింది. మరోవైపు అయిదేళ్ల పాటు వంతుల వారీగా రుణమాఫీ నిధులు విడుదల చేసిన అప్పటి ప్రభుత్వం.. చివరకు కేవలం 23 లక్షల మంది రైతులకే రుణ మాఫీ చేసినట్టుగా అధికారులు లెక్కలు తేల్చినట్టు సమాచారం. దాదాపు 14 లక్షల మంది రైతులకు రుణమాఫీ సొమ్ము ఎగవేసినట్టుగా లెక్కగట్టారు. ఈ నేపథ్యంలో గతంలో జరిగిన తప్పులు జరగకుండా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసే ప్రతిపాదనలపై మొదటి వంద రోజుల్లోనే కసరత్తు మొదలు పెట్టినట్లు అధికారులు చెబుతున్నారు.



# వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందాం..

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనందున రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ను ప్రవేశ పెట్టిందన్నారు. త్వరలోనే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతామని చెప్పారు. రైతుభరోసా పథకం అమలు కోసం ఉమ్మడి పది జిల్లాల్లో పర్యటించి ప్రజలు, రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి విధివిధానాలు రూపొందించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ క్రమంలో రైతు భరోసా అమలుపై తెలంగాణ సర్కార్ కసరత్తు చేస్తోంది. జిల్లాల వారీగా అనేక మంది నుంచి అభిప్రాయాలను సేకరిస్తోంది. అందులో భాగంగా ఖమ్మం జిల్లాలో మంత్రుల బృందం పర్యటించింది. ఈ జిల్లాల పర్యటన ముగిసిన తరువాత తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అందులో భాగంగానే జూలై 10 ఖమ్మం, 11న అదిలాబాద్, 12న మహబూబ్ నగర్, 15న వరంగల్, 16న సంగారెడ్డి(మెదక్), 18న నిజామాబాద్, 19న కరీంనగర్, 22న నల్గొండ, 23న రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయాల్లో రైతుల నుంచి ప్రజాభిప్రాయాన్ని సేకరించనున్నట్లు షెడ్యూల్‌ను రూపొందించారు. రైతుభరోసాపై విధివిధానాల ఖరారు కోసం రైతు సంఘాలు, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. అన్నిజిల్లాలో అభిప్రాయాలు సేకరించి, త్వరలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నామని తెలిపారు. అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా స్పందించారు. గత ప్రభుత్వం ఏ స్కీమ్ చేపట్టినా ప్రజల అభిప్రాయాలు తీసుకోలేదన్నారు. నాలుగు గోడల మధ్య నిర్ణయం తీసుకుని ప్రజలపై రుద్దారన్నారు. ప్రభుత్వానికి వచ్చే ప్రతీపైసా ప్రజల నుంచి వచ్చిందేనని, రైతులు ఇచ్చే సూచనలపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అలాగే ఖమ్మం జిల్లాకు చెందిన మరో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. రైతుల ఆలోచన మేరకే ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. రైతుల అభిప్రాయం తీసుకున్నాకే రైతు భరోసాపై నిర్ణయం తీసుకుంటామన్నారు. నిజమైన రైతులకే రైతుభరోసా అందాలని మంత్రి తుమ్మల అన్నారు.ప్రజల ఆలోచనల మేరకు ప్రభుత్వం ముందుకెళ్తుందని తుమ్మల అన్నారు. గతంలో జరిగిన ఆర్థిక నష్టాన్ని ప్రజలు గమనించారని వ్యాఖ్యానించారు. చిన్న, సన్నకారు రైతులకు చేయూత నిచ్చేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. రైతుల అభిప్రాయాల సేకరణ తర్వాతే ప్రభుత్వ నిర్ణయం ఉంటుందని చెప్పారు.



# చిన్నారులు చనిపోతుంటే నిర్లక్ష్యమా..?

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 10:

వీధి కుక్కల దాడుల్లో ముక్కుపచ్చలారని చిన్నారులు చనిపోతుండడంపై హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు ఏం చర్యలు తీసుకోవాలన్న అంశంపై నిపుణుల కమిటీ వేయాలని రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీకి ఆదేశాలు జారీచేసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటే రాష్ట్రమంతటా పరిష్కారం లభించినట్లేనా? అని ప్రశ్నించింది. సామాన్యుల ఆవాసాలు, మురికివాడలపైనా దృష్టి పెట్టాలని సూచించింది. ఈ అంశాన్ని ఓ పిటిషన్‌లా కాకుండా మానవీయకోణంలో చూడాల్సిన అవసరం ఉందని పేర్కొంది. గత ఏడాది ఫిబ్రవరి 19న అంబర్‌పేట్‌లో ప్రదీప్(4), తాజాగా జూన్ 28న పటాన్‌చెరులో బిహార్ వలస కూలీల కుటుంబానికి చెందిన విశాల్(6) వీధి కుక్కల దాడిలో చనిపోయిన ఘటనలపై వచ్చిన కథనాలను హైకోర్టు సుమోటోగా స్వీకరించింది.

అలాగే వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదంటూ మరో ప్రజాప్రయోజన వ్యాజ్యంపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. స్టెరిలైజేషన్ కార్యక్రమం కొనసాగిస్తున్నామని, కుక్కల నియంత్రణకు కొత్త మార్గదర్శకాలు రూపొందించామని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు తెలిపారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసేందుకు మరింత గడువు ఇవ్వాలని కోరగా.. ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. పిల్లలు చనిపోతుంటే నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని ఎట్టిపరిస్థితుల్లో సహించబోమని.. వారం రోజుల్లో నిపుణుల కమిటీ వేస్తారా? మమ్మల్ని వేయమంటారా? అని ప్రశ్నించింది. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది.

# కాంగ్రెస్ మార్క్.. మార్పు వచ్చింది



- బల్లిపడిన టిఫిన్లు.. చిట్టెలుక పడ్డ చట్నీలు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ ఎద్దేవా

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)–జులై 10:

మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి అని అన్నారని.. మొత్తానికి.. కాంగ్రెసోళ్లు వచ్చారు.. పెద్ద మార్పే తెచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఆనాటి కాంగ్రెస్ పాలనలో.. ప్రభుత్వ హాస్టళ్లలో దుస్థితి.. పురుగుల అన్నం.. నీళ్ల చారు ఉండేవన్నారు. ఈనాటి కాంగ్రెస్ పాలనలో.. ప్రభుత్వ హాస్టళ్లలో ఇంకా అధ్వాన్న పరిస్థితి ఉందన్నారు. బల్లిపడిన టిఫిన్లు, చిట్టెలుకలు తిరిగే చట్నీలు పిల్లలకు వడ్డిస్తున్నారన్నారని ఫైర్ అయ్యారు. మొన్న భువనగిరి సాంఘిక సంక్షేమ పాఠశాలలో.. కలుషిత ఆహారం తిన్న విద్యార్థి జీవితం విషాదాంతంగా మారిన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. నిన్న కోమటిపల్లి హాస్టల్‌లో ఉప్మాలో బల్లి పడి.. 20 మంది విద్యార్థులకు వాంతులు అయ్యాయన్నారు. సుల్తాన్ పూర్ జేఎన్టీయూ హాస్టల్‌లో చట్నీలో చిట్టెలుక దర్శనంతో విద్యార్థులు బెంబేలెత్తుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఈ విషాహారం తింటే.. విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఎవరని ప్రశ్నించారు. అల్లారుముద్దుగా పెంచుకున్న తల్లిదండ్రులకు భరోసా ఎక్కడుందని నిలదీశారు. కలుషిత ఆహారం వల్ల... పిల్లలు ఆడుకోవాల్సిన వయసులో ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. అస్తవ్యస్థంగా మారిన ప్రభుత్వ వ్యవస్థ వల్లే.. విద్యార్థులకు ఈ అవస్థ... ఈ అస్వస్థత.. అని పేర్కొన్నారు. ఇకనైనా కాంగ్రెస్ సర్కారు కళ్లు తెరవాలన్నారు. లేకపోతే.. భావిభారత పౌరుల నిండు ప్రాణాలకే ప్రమాదమన్నారు. వైఫల్యాలను సరిచేయకపోతే ఊహించని విషాదం చోటు చేసుకుంటుందని తెలిపారు.

## రాజకీయాల కోసం రెచ్చగొడుతున్న బిఆర్ఎస్

- వారికి ఉద్యోగాలు రావడం ఇష్టం లేదా
- మీ హయాంలో ఎందుకు డిఎస్సీ నిర్వహించలేదు
- ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం విమర్శలు

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)–జులై 10:

స్వార్థ రాజకీయాల కోసం బీఆర్ఎస్ నేతలు విద్యార్థులను రెచ్చగొడుతున్నారని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం అన్నారు. బీఆర్ఎస్ నేతలు గాదరి కిశోర్, బాల్క సుమన్ పరుశ పదజాలంతో కాంగ్రెస్ ప్రభుత్వం మీద విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఒక్కనాడు కూడా జాబ్ క్యాలెండర్‌ను ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. తాము బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తమపై కేసులు పెట్టారని ధ్వజమెత్తారు. గత పదేళ్లలో ఒక్కసారి కూడా డీఎస్సీ నోటిఫికేషన్ ఎందుకు వేయలేదని నిలదీశారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో ప్రీతం మాట్లాడుతూ.. ఇపుడు తాము నోటిఫికేషన్ వేస్తే బీఆర్ఎస్ నేతలు రాద్ధాంతం చేస్తున్నారన్ని ÷ర్ అయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి మీద పరుషంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మాజీ సీఎం కేసీఆర్ సిగ్గు లేకుండా దళితులను ముందు పెట్టి మాట్లాడిస్తున్నారని దుయ్యబట్టారు. ఆయన ఎంగిలి మెతుకుల కోసం కొందరు మాట్లాడుతున్నారని విమర్శించారు. నిరుద్యోగుల గురించి మాట్లాడటానికి బీఆర్ఎస్‌కి నైతిక అర్హత లేదని చెప్పారు.రేవంత్ వచ్చాక నిరుద్యోగులకు స్వేచ్ఛ వచ్చిందన్నారు. ధర్నాలు చేస్తున్న వాళ్లు కనీసం ఉద్యోగం కోసం దరఖాస్తు కూడా చేయలేదని అన్నారు. డబ్బులు ఇచ్చి పెయిడ్ ఆర్టిస్టులతో మాట్లాడిపిస్తు న్నారని ధ్వజమెత్తారు. ఇలాగే చేస్తే బట్టలూడదీసి ఉరికేయాల్సి వస్తదని హెచ్చరించారు. తన పదవి, రాజకీయం వదిలి నీ ముందుకు వస్తానని సవాల్ విసిరారు. 'బరిగే పడతాం, మీ ముందుకు వస్తాం. దొర దగ్గరే ఉండాలా? ఉద్యోగాలు రావద్దా? ఉద్యోగాలు వస్తున్నాయి అంటే మీకు కడుపులో మంట' అని ప్రీతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎనిమిదేళ్లుగా పదవి లేకుండా దూరం పెట్టారు..

- సికింద్రాబాద్ టిక్కెట్ ఇచ్చివుంటే గెలిచే వాడిని
- కాంగ్రెస్ మాజీ ఎంపి విహెచ్ ఆవేదన

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)–జులై 10:

గత ఎనిమిదేళ్లలో తనకు ఒక్క పదవి లేదని.. రాజ్యసభ ఎంపీగా అవకాశం కల్పించాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు (వీహెచ్) కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ ఎంపీ టికెట్ తనకు ఇస్తే గెలిచేవాడినని వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో మీడియాతో వీహెచ్ మాట్లాడారు. టికెట్ విషయంలో తనకు అన్యాయం జరిగిందన్నారు. తెలంగాణ పర్యటనకు వస్తున్న కురియన్ కమిటీ తొలుత ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలును కలవాలన్నారు. 'టీ20 వరల్డ్‌కప్ గెలిచిన టీమ్ ఇండియాకు శుభాకాంక్షలు. జట్టు సభ్యుడైన హైదరాబాదీ సిరాజ్‌కు ఇంటి స్థలం, ఉద్యోగం ఇస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు. దేశంలో క్రికెట్‌కు మంచి క్రేజ్ ఉంది. తెలంగాణలో క్రీడలను సీఎం ప్రోత్సాహించాలి. రాష్ట్రంలో హైదరాబాద్‌లో తప్ప ఎక్కడా క్రికెట్ స్టేడియం లేదు. ఏపీలో 12 ఉన్నాయి. తెలంగాణలోని ప్రతి జిల్లాలో స్టేడియం నిర్మాణానికి 12 ఎకరాల స్థలాన్ని సీఎం కేటాయించాలి. గతంలో క్రీడలను కేటీఆర్ ప్రోత్సాహించలేదు.. ఎకరం భూమి కూడా కేటాయించలేదు. అసెంబ్లీ సమావేశాల్లో క్రీడలకు ఎక్కువ బడ్జెట్ కేటాయించాలి. రుణమాఫీ చేస్తున్న రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు' అని వీహెచ్ తెలిపారు.

## వివాహ భోజనంబు హోటల్‌లో తనిఖీలు

- కాలం చెల్లిన ఆహారపదార్థాలు గుర్తింపు
- కిచెన్‌లో అపరిశుభ్రతపై ఆశ్చర్యం

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)–జులై 10:

టాలీవుడ్ హీరో సందీప్ కిషన్ రెస్టారెంట్ 'వివాహ భోజనంబు' రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నగరంలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడులు కొనసాగిస్తున్నారు. సికింద్రాబాద్‌లో గల రెస్టారెంట్‌ను అధికారులు నిశితంగా పరిశీలించారు. ఎక్స్‌పైరీ డేట్ అయిపోయిన 25 కేజీల చిట్టిముత్యాల బియ్యం, నాసిరకం ఆహార పదార్థాలను గుర్తించారు. అలాగే ఆహార పదార్థాలు నిల్వ చేసి ఫ్రిజ్‌లో పెట్టడాన్ని గుర్తించారు. ఆహారం తయారు చేసేందుకు వాడుతున్న నీటిని పరిశీలించారు. కిచెన్‌లో పరిశుభ్రత పాటించలేదు. సింథటిక్ ఫుడ్ కలర్స్ కలిపిన కొబ్బెరను గుర్తించారు. తయారు చేసిన ఫుడ్ ఎక్స్‌పైరీ డేట్ లేకుండా ఉంచడం చూసి షాకయ్యారు. ఫుడ్ ప్రిపేర్ చేసే వారి హెల్త్‌కు సంబంధించిన మెడికల్ రిపోర్ట్స్ లేవని తెలిపారు. వంట పాత్రలు క్లీన్ చేసిన నీరు అక్కడే నిల్వ ఉండడం చూసి నిర్వాహకులను అడిగారు. భారత ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ అధికారులు వివాహ భోజనంబు రెస్టారెంట్‌కు నోటీసులు ఇచ్చారు. వివాహ భోజనంబు రెస్టారెంట్ వివరాలు, అక్కడ ఉపయోగించే ఆహార వివరాలను సోషల్ మీడియా ఎక్స్‌లో జీహెచ్ఎంసీ అధికారులు పోస్ట్ చేశారు.

## ఉస్మానియాలో తెలంగాణ ఉద్యమ పరిస్థితులు

- విద్యార్థులు, జర్నలిస్టులను కూడా వదలడం లేదు
- సమైక్యరాష్ట్రంలో లాగా రేవంత్ వేధింపుల పాలన
- బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శలు

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)–జులై 10:

ఉస్మానియా యూనివర్సిటీలో మళ్లీ ఉద్యమ కాలం నాటి పరిస్థితులు పునరావృతం అవుతున్నాయని, విద్యార్థులను ఉగ్రవాదులా మాదిరి పోలీసులు వెంటాడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో బాల్క సుమన్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేరుకే ప్రజా పాలన.. కానీ దగా పాలన నడుస్తోందని మండిపడ్డారు. గురుకులాలు, యునివర్సిటీ హాస్టళ్లలో విద్యార్థుల పరిస్థితి దారుణంగా తయారైంది. సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో చట్నీలో చిట్టెలుక వచ్చింది. కోమటిపల్లి హాస్టల్‌లో ఉప్మాలో బల్లి పడింది. భువనగిరి సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో 20 మంది దాకా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు అని బాల్క సుమన్ గుర్తు చేశారు. గురుకులాల వల్ల విద్యార్థులకు తల్లిదండ్రులకు మధ్య గ్యాప్ వచ్చిందని చెబుతూ.. వాటిని ఎత్తేయాలనే ఉద్దేశంతో రేవంత్ ఉన్నారు. రెండు నెలలుగా రాష్ట్రంలోని వర్సిటీలకు వీసీలు లేరు. నిర్లక్ష్యంగా యూనివర్సిటీలను వదిలేశారు. యూనివర్సిటీల్లో ఉంటూ పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న నిరుద్యోగుల డిమాండ్లను పట్టించుకోవడం లేదు. గ్రూప్ –1 మెయిన్స్‌కు 1:100 పిలవాలి. 2 లక్షలకు సంబంధించి జాబ్ క్యాలెండర్, గ్రూప్–2లో 2 వేలు, గ్రూప్–3లో 3 వేల పోస్టులను అదనంగా పెంచాలి. నిరుద్యోగ భృతి 4 వేలు ఇస్తామని చెప్పారు.. ఈ డిమాండ్ల కోసం నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నారు. నిరుద్యోగులు డిమాండ్లు చేస్తుంటే కావాలని కరెంట్ తీసేయడం, నీళ్లను బంద్ చేయడం లాంటివి జరుగుతున్నాయి. ఉమ్మడి ఏపీలో ఎలాగైతే ఇనుప కంచెలతో ఉక్కుపాదం మోపారో.. మళ్లీ ఆ పరిస్థితులను రేవంత్ రెడ్డి తీసుకొచ్చారు అని బాల్క సుమన్ ఫైర్ అయ్యారు. ఉస్మానియా క్యాంపస్‌లో డీఎస్సీ అభ్యర్థుల న్యూసెన్ కవరేజ్‌కు వెళ్లిన జీ తెలుగు రిపోర్టర్‌ను చొక్కా పట్టుకుని వ్యాన్‌లో ఎక్కించారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి విద్యాలయాలను నిర్లక్ష్యం చేస్తూ అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసనలు తెలిపితే పోలీసులను అడ్డం పెట్టుకుని గొంతులు నొక్కుతున్నాడు. చివరకు మీడియా గొంతు కూడా నొక్కాడు. ముఖ్యమంత్రిగా, హోం మంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా దమనకాండ ప్రదర్శిస్తున్నారు. ఇది ప్రజా పాలన కాదు.. దగా పాలన.. దమనకాండ పాలన అంటూ విర్రులు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడితే కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మంచిగా చూస్తది. కానీ ఆచరణలో రవ్వంత కూడా చూపించడం లేదు. కేబినెట్‌లోని ఎస్సీ, బీసీ మంత్రులకు అవమానాలు జరుగుతున్నాయి. యాదాద్రిలో దేవుడి సాక్షిగా ఉద్దేశపూర్వకంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు చిన్నపీట వేసి కూర్చోబెట్టారు. రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పెద్దపీటల్లో కూర్చున్నారు. అక్కడ ఎస్సీ, బీసీ మంత్రులకు అవమానం జరిగింది. నిన్న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం సందర్భంగా సేమ్ సీన్ రిపీట్ అయిందని బాల్క సుమన్ గుర్తు చేశారు. ఎస్సీ, బీసీ అధికారులకు కూడా అవమానాలు జరుగుతున్నాయి. అశ్వరావుపేట ఎస్ఐ శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నారు. ఇటీవల నియమించిన 35 కార్పొరేషన్లలో సామాజిక న్యాయం లేదు. రేవంత్ పరిపాలనలో ఎక్కడా కూడా సామాజిక సమతూకం అసలే లేకుండా పోయిందని అన్నారు.

## ప్రభుత్వం కూలాలి.. తాము గద్దెనెక్కాలి

- బిజెపి తీరు ఇలాగే ఉందన్న రాఘవులు
- లౌకికశక్తులను రేవంత్ ఏకం చేయాలని పిలుపు

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)–జులై 10:

తెలంగాణలో ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందా.. ఎప్పుడు గద్దెనెక్కుదామని భాజపా కాచుక్కూర్చుందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీ కుట్రలను తిప్పికొట్టేందుకు లౌకికశక్తులను సీఎం రేవంత్‌రెడ్డి ఏకం చేయాల్సిన అవసరముందన్నారు. ప్రజలపై కేంద్రం మోపిన భారాన్ని మరిచిపోయి..రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను కిషన్‌రెడ్డి చదువుతున్నారని రాఘవులు మండిపడ్డారు. కేవలం రాష్ట్రప్రభుత్వాన్ని తిట్టిపోయడం మాని, కేంద్రం ఏం చేసిందో...ఏం చేస్తుందో చెప్పాలన్నారు. దేశమంతా అభివృద్ధి జరిగితే జీవీఎల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో భాజపాకు సీట్లు ఎందుకు తగ్గాయని ప్రధాని మోదీ చెప్పాలని రాఘవులు ప్రశ్నించారు. రష్యా పర్యటనలో ప్రధాని చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. మరోవైపు పార్లమెంట్‌లో ఇష్యూ టు ఇష్యూ బట్టి వ్యవహరిస్తామని కేటీఆర్ చెబుతున్నారని రాఘవులు గుర్తుచేశారు. అలా స్పందించడం రాజకీయం కాదు.. లొంగుబాటు అని వ్యాఖ్యానించారు. భారాసకు మనుగడ ఉండాలంటే భాజపాకు వ్యతిరేకంగా రాజకీయ నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సీట్లు తగ్గడంపై ఆలోచన, ఆత్మవిమర్శ చేసుకోకుండా మోదీ వ్యాఖ్యలు చేస్తున్నారు. ఎన్నికలను భాజపా డబ్బుతో ముంచేసింది. తెలంగాణలో ఆ పార్టీ ఓటు బ్యాంకు 19 నుంచి 35 శాతానికి పెరగడం ప్రమాదకరం. రాష్ట్రంలో భాజపాను నియంత్రించడంలో కాంగ్రెస్ విఫలమైంది. కేరళలో కాషాయ పార్టీ ఒక్క సీటు సాధించడం చింతించాల్సిన విషయం. అక్కడ కమ్యూనిస్టులను కాంగ్రెస్ ప్రతిపక్షంగా చూసినందునే భాజపా గెలిచింది. కార్పొరేట్ శక్తులకు సేవకుడిగా మోదీ వ్యవహరిస్తున్నారు. ఇండియా కూటమి విచ్ఛిన్నం కాకుండా ముందుకు వెళ్లడంలో సీపీఎం చేసిన త్యాగం మరెవరూ చేయలేదు. పశ్చిమబెంగాల్‌లో సీపీఎం, కాంగ్రెస్ సీట్లు సర్దుబాటు చేసుకున్నా కాంగ్రెస్‌కు చెందిన ఏ ఒక్క జాతీయ నాయకుడూ ప్రచారం నిర్వహించలేదు. ఓట్లు, సీట్లు కాదు.. దేశాన్ని రక్షించుకోవడమే సీపీఎం లక్ష్యం. మతోన్మాదాన్ని ప్రజల మనసు నుంచి తీసివేసే బాధ్యత సీపీఎంపై ఉంది.

## వ్యక్తిగత జీవితాల్లోకి వెళ్లి అనవసర రాద్ధాంతం చేయొద్దు

- ఫోన్ ట్యాపింగ్ కేసుపై హైకోర్టు సుమోటో విచారణ
- సంయమనం పాటించాలని మీడియాకు సూచన
- జడ్జిల పేర్లు, ఫోన్ నంబర్లు వెల్లడించవద్దని ఆదేశాలు

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)–జులై 10:

ఫోన్ ట్యాపింగ్ విషయంలో సంయమనం పాటించాలని తెలంగాణ హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం పలు కీలక సూచనలు చేసింది. వ్యక్తిగత జీవితాల్లోకి వెళ్లి అనవసర రాద్ధాంతం చేయొద్దని, జడ్జిలు, వారి కుటుంబ సభ్యుల పేర్లు బహిర్గతం చేయొద్దని స్పష్టం చేసింది. ఫోన్ నంబర్లు, ఫొటోలు బహిర్గతం చేయొద్దని సూచించింది. అలాగే తదుపరి విచారణను హైకోర్టు ఈనెల 23కి వాయిదా వేసింది. రాజకీయ నేతలతో పాటు జడ్జిల ఫోన్లు ట్యాప్ చేశారని పత్రికల్లో కథనాలు రావడంతో ఫోన్ ట్యాపింగ్ కేసును హైకోర్టు సుమోటోగా స్వీకరించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం కౌంటరుదాఖలు చేసింది. కేసు విచారణ జరుగుతోందని, నిందితులను అరెస్టు చేసినట్లు కౌంటర్‌లో పేర్కొంది. పలువురు పోలీసు అధికారుల ఫోన్లు సైతం ట్యాపింగ్ చేసినట్లు తెలిపింది. ఈ వ్యవహారంపై బుధవారం మరోసారి హైకోర్టు విచారణ చేపట్టింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో మీడియా కూడా సంయమనం పాటించాలని, ట్యాపింగ్‌కు గురైన జడ్జిల వివరాలను వెల్లడి చేయొద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ పలు రాజకీయ నాయకులు, హైకోర్టు జడ్జిల ఫోన్లు సైతం ట్యాపింగ్ చేసినట్టు పత్రికల్లో వచ్చిన కథనాలు వచ్చాయి. వాటిని సుమోటోగా స్వీకరించిన హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. మరోవైపు ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుల్ని విచారించిన అధికారులు కీలక విషయాలను రాబట్టారు. అందులో హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్లు కూడా ట్యాప్ చేశామని నిందితులు విచారణలో ఒప్పుకున్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు గురైన జడ్జిల పేర్లు ఎక్కడ వాడొద్దు. వారి ఫోన్ నెంబర్లు, కుటుంబ సభ్యుల పేర్లు, ఫోటోలు బహిర్గతం చేయవద్దని హైకోర్టు ఆదేశించింది.



## బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి

- కనీస వేతనం 26 వేల రూపాయలు నిర్ణయించాలి
- ఆఫీస్ నుండి ఎమ్మార్వో ఆఫీస్ వరకు భారీ ర్యాలీ, వినతి పత్రం
- జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్

నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి, (స్టేట్ కోఆర్డినేటర్)–జులై 10:

కేంద్ర బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని, కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని కార్మికులకు అందరికీ కనీస వేతనం 26 వేల రూపాయలు నిర్ణయించాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈరోజు సిఐటి ఆల్ ఇండియా కమిటీ పిలుపుమేరకు ఆల్ ఇండియా డిమాండ్స్ డే సందర్భంగా స్థానిక సిఐటియూ ఆఫీస్ నుండి ఎమ్మార్వో ఆఫీస్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి తాసిల్దార్ గారికి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినాక కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుంది అన్నారు. పూర్తిస్థాయి మెజార్టీ లేకున్నా సంకీర్ణ ప్రభుత్వంలో కూడా బిజెపి ప్రభుత్వం పేదల సంక్షేమం కార్మికుల సంక్షేమం కాకుండా పెట్టుబడిదారుల సంక్షేమం కోసమే ఈ ప్రభుత్వం పని చేస్తుంది అన్నారు. ఐటీ రంగంలో నాలుగు సంవత్సరాల వరకు ఎలాంటి కార్మిక చట్టాలు వర్తించవని కేంద్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం చాలా దుర్మార్గం అన్నారు. ఇంతకుముందు ఎవరైనా పిఎఫ్ డబ్బులు కట్టకపోతే 25% పెనాల్టీ ఉండేది కానీ ఈ కేంద్ర ప్రభుత్వం ఆడు శాతానికి కుదించి ఫినాల్టీని తగ్గించిందన్నారు. అంటే పెట్టుబడిదారులు బడా కార్పొరేట్ల కోసమే ఈ ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టంగా అర్థం అవుతుంది అన్నారు. సంపద సృష్టించే కార్మిక వర్గం గురించి ఈ ప్రభుత్వం అస్సలు ఆలోచన చేయడం లేదు. సమాజంలో పెరుగుతున్న దరఖా ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఉన్న ఎక్కడ అమలు జరగడం లేదు అన్నారు అంగన్వాడీ ఆశ మున్సిపల్ గ్రామపంచాయతీ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా కార్మికులకు పరీక్ష పెట్టే విధానాన్ని రద్దు చేయాలని ఆయన కోరారు అంగన్వాడీ రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లు రెండు లక్షలు ఆయాకు ఒక లక్ష రూపాయలు ఇవ్వాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల గురించి ఆలోచించి వారి సమస్యలు పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ యూనియన్ నాయకులు మల్లేష్ శ్రీనివాస్ బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో పరిశ్రమ యూనియన్ నాయకులు శ్రీనివాస్ జనార్ధన్ సంజీవరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు మంజుల ఇందిరా లక్ష్మి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు యశోద లావణ్య మున్సిపల్ యూనియన్ నాయకులు రవి శ్రీను అంజయ్య గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు దశరథ్ శేఖర్ యాదమ్మ సంజీవులు భవన్ డ్రైవర్ యూనియన్ నాయకులు శ్రీనివాస్ ఎండి మైబాబ్ డివైఎఫ్ఐ నాయకులు అనిల్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## భారీగా బంగారం పట్టివేత

లద్దాఖ్, (నేటి ఫోకస్ న్యూస్)–జులై 10:

భారత్– చైనా సరిహద్దులో అక్రమంగా రవాణా చేస్తున్న 108 కిలోల బంగారాన్ని భద్రతాదళం స్వాధీనం చేసుకొంది. ముగ్గురు వ్యక్తులను కస్టడీలోకి తీసుకున్నారు. ఈ ఘటన తూర్పు లద్దాఖ్‌లో చోటు చేసుకొంది. ఈనెల 9న తూర్పు లద్దాఖ్‌లో ఇండో– టిబెటన్ బార్డర్ పోలీసు బలగాలు గస్తీ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలోనే స్మగ్లింగ్ గురించి సమాచారం అందడంతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను ప్రశ్నించారు. సోదాలు చేయగా 108 కిలోల బంగారు కడ్డీలతో పాటు రెండు మొబైల్ ఫోన్లు, బైనాక్యులర్, రెండు కత్తులు, చైనాకు చెందిన కొన్ని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ఐటీబీపీ వెల్లడించింది. ముగ్గురిని అరెస్టు చేసినట్లు తెలిపింది. ఇందులో ఇద్దరు లద్దాఖ్‌లోని న్యోమా ప్రాంతానికి చెందినవారిగా భద్రతా దళాలు గుర్తించాయి. ఆ ప్రాంతంలో ఇంత భారీ మొత్తంలో బంగారాన్ని స్వాధీనం చేసుకోవడం ఇదే తొలిసారి.

## జర్నలిస్టుల పైనా మీ ప్రతాపం

– ఓయూ ఘటనలపై హరీష్ రావు

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)–జులై 10:

ఉస్మానియా యూనివర్సిటీ సాక్షిగా జర్నలిస్టుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు బిఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రకటించారు. డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగులు డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నిరసనలు తెలియజేస్తుంటే, విధి నిర్వహణలో భాగంగా ఆ వార్తలు కవర్ చేయడమే వారు చేసిన తప్పా? అని నిలదీశారు. జర్నలిస్టులను అరెస్టు చేయడం, బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించడం మీడియా హక్కును, స్వేచ్ఛను కాలరాయడమే అన్నారు. జర్నలిస్టుల పట్ల అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని మార్చుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం. అదుపులోకి తీసుకున్న జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ మెయిన్ లైబ్రరీ వద్ద డీఎస్సీ అభ్యర్థులు ఆందోళనలను కవరేజ్ చేసేందుకు వెళ్లిన జీ న్యూస్ రిపోర్టర్ పట్ల పోలీసులు అమర్యాదగా ప్రవర్తించిన సంగతి తెలిసిందే. జీ న్యూస్ రిపోర్టర్ చొక్కా పట్టుకుని పోలీసులు లాక్కెళ్లారు. నేను జర్నలిస్టును.. మా పని మీరు చేసుకోండి.. మా పని మేం చేసుకుంటాం అంటున్నా కూడా పోలీసులు వినిపించుకోకుండా, బలవంతంగా పోలీసు వాహనంలో ఎక్కించారు.

# కల్కి సినిమాను ప్రేక్షకులతో కలిసి చూడాలనుంది


**దర్శకుడు నాగ్ అశ్విన్‌ను ఇంటర్వ్యూ** చేసిన బచ్చన్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏడీ'ను తెలుగు ప్రేక్షకులతో కలిసి చూడాలని ఉందన్నారు ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్. ఈ చిత్రం భారీ విజయాన్ని సాధించిన నేపథ్యంలో దర్శకుడిని ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ చేశారు. తాజాగా దానికి సంబంధించిన ప్రోమోను నిర్మాణ సంస్థ విడుదల చేసింది. 'కల్కి'లో చేసినందుకు వస్తోన్న ప్రశంసలు నా నటనకు అనుకోవడం లేదు. ఆ పాత్ర, కాన్సెప్ట్‌కు వస్తున్నాయి. 'కల్కి'లో దీపికా పదుకొణె పాత్ర అద్భుతం. ఈ ఐడియా వచ్చినందుకు మిమ్మల్ని (నాగ్ అశ్విన్) ప్రశంసించాలి. ఆమె నిప్పుల్లో నడుచుకుంటే వచ్చే సన్నివేశం హైలైట్. కానీ అందులో తనకేం కాకుండా చూపించారు. ఈ విషయంపై నేను ప్రేక్షకుల అభిప్రాయాలు తెలుసుకోవాలి. సినిమా ఎలా ఉందని వాళ్లను అడిగి కనుక్కోవాలి. హైదరాబాద్‌లో ఉన్న తెలుగు ప్రేక్షకుల మధ్య కూర్చొని సినిమా చూడాలి. ఎందుకంటే వాళ్లు సినిమాను బాగా ఎంజాయ్ చేస్తున్నారు' అని అమితాబ్ అన్నారు. ఇక 'కల్కి' పూర్తి కాన్సెప్ట్ గురించి నాగ్ అశ్విన్ మాట్లాడుతూ.. 'ఇది మహాభారతంలో జరిగే చివరి ఘట్టం' అని క్లారిటీ ఇచ్చారు. మరోవైపు 'కల్కి' వసూళ్ల వర్షం కురిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకు ఈ మూవీ రూ.900 కోట్లకు పైగా వసూలు చేసినట్లు చిత్ర బృందం తాజాగా ప్రకటించింది. అలాగే ఈ సినిమా ఓటీటీ విడుదల గురించి కూడా కొన్ని వార్తలు సోషల్ మీడియాలో ప్రచారమవుతున్నాయి. ఆగస్టు 15నుంచి ఇది ఓటీటీలోకి రానున్నట్లు తెలుస్తోంది.



## సోషియో ఫాంటసీ చిత్రాలకు బహుళ ఆదరణ

### ఇది ఈ నేల గొప్పతనమన్న నటి మంచు లక్ష్మి

శక్తిమంతమైన సోషియో ఫాంటసీ కథల్ని తీసి ప్రేక్షకులకు చూపిస్తున్నామంటే అది మన నేల గొప్పతనమే' అన్నారు నటి మంచు లక్ష్మి.ఆమె ప్రధాన పాత్రధారిగా తెరకెక్కిన చిత్రం 'ఆదిపర్వం'. శివ కంఠంనేని, ఆదిత్య ఓం, ఎస్తర్ నోరోన్హా కీలక పాత్రలు పోషించారు. సంజీవ్ మేగోటి దర్శకత్వం వహించారు. ఎమ్.ఎస్.కె నిర్మాత. తెలుగుతోపాటు, తమిళ, కన్నడ, హిందీ, మలయాళంలో రూపొందిన ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల హైదరాబాద్‌లో పాటల్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంచు లక్ష్మి మాట్లాడుతూ దేవతగా నటించాలన్నా... దెయ్యం పాత్ర అయినా ఈమధ్య నన్నే సంప్రదిస్తున్నారు. 'యక్షిణి' అనే వెబ్ సిరీస్ చేశాను. చాలా మంచి స్పందన వచ్చింది. ఆ వెంటనే 'ఆదిపర్వం' చేశా. ఓ మంచి సోషియో ఫాంటసీ చిత్రమిది. మా బృందమంతా ఎంతో కష్టపడి ఈ సినిమా చేసింది. నేను గతేడాది మొత్తం యాక్షన్ సన్నివేశాల్లో నటిస్తూనే ఉన్నా. అంతగా నాతో యాక్షన్ చేయించారు. మా దర్శకుడు ఓ భగీరథ ప్రయత్నమే చేశాడు.



## వరుస ఆఫర్లతో కోమల్ దూకుడు

### గోట్ మంచి విజయం సాధిస్తుందని ధీమా

**తమిళంలోనే కాకుండా, మాలీవుడ్, బాలీవుడ్ చిత్రాల్లో** వరుస ఆఫర్లతో దూసుకెళుతుంది మాజీ మిస్ తమిళనాడు, స్క్వాష్ ప్లేయర్, హీరోయిన్ కోమల్ శర్మ.ప్రస్తుతం తమిళ , మలయాళాల్లో మోహన్ లాల్, విజయ్ నటిస్తున్న రెండు భారీ ప్రాజెక్టు చిత్రాలలో నటిస్తున్న ఈ ముద్దగుమ్మ ఈ చిత్రాలతో తన సినిమా కెరీర్ టర్న్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తోంది. తమిళనాడులో పుట్టి పెరిగిన కోమల్ శర్మ రెండు సార్లు మిస్ తమిళనాడు కిరీటం దక్కించుకుంది. ఆపై స్క్వాష్ ప్లేయర్‌గా తమిళనాడు తరుపున ఆడి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో చాంపియన్ షిప్‌లు సైతం గెలిచింది. 2013లో సీనియర్ దర్శకుడు ఎస్.ఏ.చంద్రశేఖర్ దర్శకత్వంలో వచ్చిన 'చట్టప్పడి కుట్రం' అనే సినిమా ద్వారా కోలీవుడ్‌కు పరిచయమైన కోమల్ శర్మ ఆ తర్వాత 'అమైదిపడై-2', 'వైగై ఎక్స్‌ప్రెస్', 'పబ్లిక్', బాలీవుడ్‌లో హంగామా, తెలగులో అను అనే ఆరేడు చిత్రాల్లో నటించింది. ఎక్కువగా మోహన్‌లాల్, దర్శకుడు ప్రియదర్శన్ చిత్రాల్లో కనిపించి గుర్తింపు తెచ్చుకుంది ఈ ముద్దగుమ్మ కోమల్ శర్మ. ప్రస్తుతం మోహన్‌లాల్ తొలిసారి దర్శకత్వం వహిస్తూ రూపొందిస్తున్న బరోజ్ , తమిళంలో అగ్ర హీరో విజయ్ నటిస్తున్న కొత్త చిత్రం 'ది గోట్'లో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ సందర్భంగా ఆమో ఓ మీడియాతో మాట్లాడుతూ.. 'ది గోట్'లో హీరో విజయ్‌తో కలిసి నటించే సన్నివేశాలు ఎక్కువగా ఉన్నాయని సినిమా భారీ విజయం సాధించి తమిళ చిత్ర పరిశ్రమలో ఒక ట్రెండ్ సృష్టిస్తుందన్న నమ్మకం ఉందన్నారు.-



## వినూత్నంగా కిరణ్ అబ్బవరం సినిమా టైటిల్..

**యువ నటుడు కిరణ్ అబ్బవరం** వైవిధ్యమైన కథలను చేస్తూ ముందుకు వెళుతున్నాడు. ఈ కోవలోనే ఇప్పుడు కిరణ్ ఒక భారీ పీరియాడిక్ థ్రిల్లర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతు న్నాడు. ఈ సినిమాకి ఒక వెరైటీ టైటిల్‌ని కూడా పెట్టాడు. ఇంతకీ ఆ సినిమా టైటిల్ ఏంటో తెలిస్తే ఆశ్చర్యపోతారు. ఈ సినిమాకు 'క' అనే ఆసక్తికరమైన టైటిల్ ఈరోజు ప్రకటిం చారు. టైటిల్ అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో కిరణ్ అబ్బవరం మేకోవర్ ఆసక్తి కలిగిస్తోంది. ఈ సినిమాను చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడ క్షన్ వ్యాల్యూస్ తో నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి దర్శకత్వం కూడా ఇద్దరు చేస్తున్నారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు, ఈ సినిమా కథ ఒక విలేజ్ బ్యాక్ డ్రాప్‌తో వస్తోంది. అంతే కాకుండా ఇది ఒక యాక్షన్ థ్రిల్లర్ కథగా కూడా రూపొందిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ కూడా పూర్తయ్యింది అని చెపుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి అని చెపుతున్నారు. త్వరలో తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకురాబోతున్నారు. కొంత విరామం తీసుకొని కిరణ్ అబ్బవరం చేస్తున్న ఈ 'క' సినిమా ప్రకటన ఆసక్తిని రేపుతోంది.

